సాక్షి
కాకినాడ
మంగళవారం । 7 । అక్టోబర్ । 2025



రూ.50 వేల విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి మేకా ఏసుదాసు (మండపేట) సోమవారం రూ.50,049 విరాళం సమర్పించారు.



తరుముకొచ్చి.. కబళించిన మృత్యువు

కష్టసుఖాలు చెప్పుకొంటూ సాగిపోతున్న ఆ దంపతులను మృత్యువు కారు రూపంలో తరుముకొచ్చి కబళించింది.

8లో

కడలిలోకి 4.24 లక్షల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం 4,24,337 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 4,700, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 6,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.30 అడుగులకు చేరింది.

సెజ్ రైతులపై కక్ష!

- గతంలో భూములు తిరిగిచ్చిన జగన్ ప్రభుత్వం
- నాడు ఉచిత రిజిస్ట్రేషన్లతో మేలు
- నేడు సాఫ్ట్‌వేర్ ప్రతిబంధకాలతో జాప్యం
- కలెక్టర్ లేఖ రాసినా స్పందించని రిజిస్ట్రేషన్ల శాఖ
- 1,189 ఎకరాలకు నిలిచిన రిజిస్ట్రేషన్లు
- 300 మందికి ఇబ్బందులు
- కూటమి సర్కారు తీరుపై ఆగ్రహం



భూముల కోసం పోరాడుతున్న రైతులపై అట్రాసిటీ కేసులు పెట్టడంతో కొత్తపల్లి పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టిన రైతులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట.. అధికారంలోకి వచ్చాక మరో మాట చెప్పడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. గతంలో ప్రతిపక్షంలో ఉండగా కాకినాడ ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) లోని రైతుల భూములు తిరిగి వారికే రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చేస్తామని చెప్పుకొచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక ఆ రైతులపై కక్ష కట్టినట్టు ఆ అంశాన్ని గాలికొదిలేశారు. తద్వారా కాకినాడ తీరంలోని తొండంగి, ఉప్పాడ కొత్తపల్లి మండలాల పరిధిలో సుమారు 300 మంది రైతుల జీవితాలతో సర్కారు ఆటలాడుకుంటోంది.

గత చంద్రబాబు పాలనలోనే భూసేకరణ

కాకినాడ సెజ్ కోసం తొండంగి, ఉప్పాడ కొత్తపల్లి మండలాల పరిధిలో గత చంద్రబాబు సర్కార్ అవసరం లేకున్నా అడ్డగోలుగా 8,401 ఎకరాలు సేకరించింది. ఇందులో 2,180 ఎకరాల భూ సేకరణను అప్పట్లో రైతులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ భూముల స్వాధీనానికి అప్పట్లో చంద్రబాబు సర్కారు వందలాది మంది రైతులు, ఉద్యమ నేతలపై ఉక్కుపాదం మోపింది. అయినప్పటికీ పెద్ద ఎత్తున ఉద్యమం నడిచింది.

గతంలో వెనక్కిచ్చిన జగన్ ప్రభుత్వం

అటువంటి తరుణంలో ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా సెజ్ ప్రాంతానికి వచ్చిన నాటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవసరం లేని భూములను రైతులకు తిరిగి ఇచ్చేస్తామని హామీ ఇచ్చారు. దీనికి అనుగుణంగా పోర్టు ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకని నిర్దేశించిన కాకినాడ సెజ్‌లో అవసరం లేని భూములను రైతులకు తిరిగి ఇచ్చేయాలని గత జగన్ ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు 2021 మార్చి 4న జీఓఎంఎస్ నంబర్ 12/21 ద్వారా ప్రత్యేక ఉత్తర్వులు ఇచ్చింది. అంతేకాకుండా రైతులకు ఆ భూములను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని కూడా నిర్ణయించింది. ఆ మేరకు 2021 జూలై 6న జీఓఎంఎస్ నంబర్ 158ని అనుసరించి స్టాంప్ డ్యూటీ మినహాయించి ఉచిత రిజిస్ట్రేషన్లతో రైతులకు మేలు చేసింది. రైతులకు తిరిగి ఇచ్చేసే భూములకు రిజిస్ట్రేషన్ చేసే ప్రక్రియ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే ప్రారంభమైంది. నాడు గ్రామ సచివాలయాల్లో సైతం ఉచిత రిజిస్ట్రేషన్లు చేయించారు.

సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయక...

గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఉచిత రిజిస్ట్రేషన్లకు అవసరమైన మార్పులను సంబంధిత సాఫ్ట్‌వేర్‌లో చేయకుండా జాప్యం చేస్తోంది. తద్వారా సాంకేతిక ప్రతిబంధకాన్ని సాకుగా చూపిస్తూ, ఉచిత రిజిస్ట్రేషన్లకు బ్రేకులు వేసింది. ఇది సుమారు 300 మంది సెజ్ రైతులకు శాపంగా మారింది. గత జగన్ ప్రభుత్వం భూ మార్పిడి కింద రైతుల నుంచి 785 ఎకరాలు తీసుకుని, వారి సొంత మండలాల్లో గ్రామాలకు ఆనుకుని భూములు తిరిగి ఇవ్వడానికి శ్రీకారం చుట్టింది. **సెజ్ కోసం చంద్రబాబు సర్కారు అడ్డగోలుగా సేకరించిన భూముల్లో 526 ఎకరాలను జగన్ ప్రభుత్వం రైతులకు తిరిగి ఇవ్వడమే కాకుండా ఉచితంగా రిజిస్ట్రేషన్లు కూడా చేయించింది.** అనంతరం కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఉచిత రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. రైతులకు 259 ఎకరాలు రీ రిజిస్ట్రేషన్లు జరగకుండా పెండింగ్‌లో పడిపోయాయి. అలాగే, ఎవరి భూమి వారికి వదిలేసిన దానిలో 1,395 ఎకరాలున్నాయి. ఇందులో 465 ఎకరాలు రైతుల పేరున రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చేశారు. మిగిలిన 930 ఎకరాలు రిజిస్ట్రేషన్‌కు నోచుకోక రైతులు గగ్గోలు పెడుతున్నారు. రిజిస్ట్రేషన్లకు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత ఏడాది అక్టోబరు 30న జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి రిజిస్ట్రేషన్ శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్‌కు లేఖ కూడా రాశారు. అయినప్పటికీ కూటమి సర్కారు సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయకుండా గాలికొదిలేసింది.

నష్టపోతున్న రైతులు

తమ భూములను తిరిగి ఇచ్చే ఉద్దేశం లేనందువల్లనే కూటమి ప్రభుత్వం ఈ విధంగా వ్యవహరిస్తోందనే విమర్శలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. భూముల రిజిస్ట్రేషన్లు జరగకపోవడంతో సెజ్ రైతులు అన్ని విధాలా నష్టపోతున్నారు. భూములు తమవని చెప్పుకోవడానికే తప్ప అధికారికంగా ఎందుకు పనికిరాకుండా ఉన్నాయని మండిపడుతున్నారు. ఈ భూముల టైటిల్ డీడ్స్ అన్నీ కాకినాడ సెజ్ పేరిట ఉన్నాయి. అదే రైతులకు పెద్ద గుదిబండగా మారింది. ఈ కారణంగా వీటిని కనీసం బ్యాంకులో తాకట్టు పెట్టి రుణం తీసుకోవాలన్నా.. పిల్లలకు కట్నకానుకలుగా ముట్టజెప్పాలన్నా రైతులకు అవకాశం ఉండటం లేదు. కూటమి ప్రభుత్వం ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించడానికి ముందుకు రాకుంటే డబ్బులు పెట్టి చేయించుకోవాలని అనుకున్నా సెజ్ భూములు కమర్షియల్‌లో ఉన్నాయి. ఈ కారణంగా వీటి విలువ పెరిగిపోయి రిజిస్ట్రేషన్ చార్జీలు రెండు మూడింతలు పెరిగిపోయి, రైతులకు తలకు మించిన భారమవుతోంది. వారసత్వంగా తాతముత్తాల దగ్గర నుంచి వస్తున్న ఈ భూములను నాడు జగన్ సర్కార్ తిరిగి ఇచ్చేస్తామని చెప్పడమే కాకుండా ఉచితంగా రిజిస్ట్రేషన్ కూడా చేయించగా.. అంతటి మానవతా దృక్పథం చంద్రబాబు సర్కారుకు లేకుండా పోయిందని రైతులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉండగా సెజ్ భూముల్లో ఏరువాక సాగి, రైతుల భూములు తిరిగి ఇచ్చేస్తానన్న చంద్రబాబు.. తీరా గద్దెనెక్కాక ఆ విషయం పట్టించుకోకపోవడమేమిటని ప్రశ్నిస్తున్నారు.

పిల్లలకు పెళ్లిళ్లు చేయలేని పరిస్థితి



భూములున్నా రిజిస్ట్రేషన్లు జరగకపోవడంతో పిల్లలకు పెళ్లిళ్లు చేయలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఎంతోమంది రైతులు ఈ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తిరిగి ఇచ్చిన భూములకు కూటమి ప్రభుత్వం రిజిస్ట్రేషన్లను నిలిపివేసింది. తక్షణమే రిజిస్ట్రేషన్లు యథావిధిగా నిర్వహించాలి.

– చింతా సూర్యనారాయణమూర్తి, రైతు, మూలపేట, కొత్తపల్లి మండలం

రిజిస్ట్రేషన్లు చేయాలి



గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మినహాయింపు ప్రకటించిన సెజ్ భూములకు వెంటనే రిజిస్ట్రేషన్లు చేయాలి. అలా చేయకపోవడంతో చాలా ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడింది. నాకు ఏడెకరాలకు రిజిస్ట్రేషన్ చేయాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మినహాయింపు భూములకు రిజిస్ట్రేషన్ నిలిపియడం చాలా దారుణం.

– బొమ్మిడి గోవిందు, రావివారిపోడు, కొత్తపల్లి మండలం

న్యూస్‌రీల్

నేడు జెడ్పీ సమావేశం

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు సీఈఓ వీవీఎస్ లక్ష్మణరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి జెడ్పీ పరిధిలోని కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాల అధికారులు పాల్గొనాలని సీఈఓ కోరారు.

పీజీఆర్ఎస్‌కు 418 అర్జీలు



పీజీఆర్ఎస్‌లో ఓ వ్యక్తి సమస్య ఆలకిస్తున్న జేసీ రాహుల్ మీనా

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు 418 అర్జీలు సమర్పించారు. వారి నుంచి జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, ఇతర అధికారులు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బియ్యం కార్డు మంజూరు, కార్డుల్లో పేర్ల మార్పులు చేర్పులు, పింఛన్లు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, ఇళ్ల స్థలాలు, ఆన్‌లైన్‌లో భూమి వివరాల నమోదు, రీ సర్వే, ఆక్రమణల తొలగింపు, డ్రైన్, కాలువల్లో పూడికల తొలగింపు, పారిశుధ్యం తదితర సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు.

పంచారామ క్షేత్రంలో 22 నుంచి కార్తిక మాసోత్సవాలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామ భీమేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 22 నుంచి నవంబర్ 20వ తేదీ వరకూ కార్తిక మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 21వ తేదీ సాయంత్రం 6 గంటకు ఆకాశదీపంతో కార్తిక మాసోత్సవాలు ప్రారంభిస్తామన్నారు. స్వామివారి కార్తిక మాస దర్శనాలు 22 నుంచి ఉంటాయన్నారు. నాలుగు ఆది, నాలుగు సోమవారాల్లో భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు. నవంబర్ 5న కార్తిక పౌర్ణమి, 6న కృత్తికా నక్షత్రాన్ని పురస్కరించుకొని గ్రామోత్సవం ఉంటాయని తెలిపారు. స్వామివారు ఆలయానికి తిరిగి వచ్చిన తరువాత రాత్రి జ్వాలాతోరణం నిర్వహిస్తామన్నారు. నవంబర్ 18న మాసశివరాత్రి, 20న అమావాస్య సందర్భంగా కోటి దీపోత్సవం, 21న పోలి పాడ్యమిని పురస్కరించుకొని స్వామివారికి జటాజూటాలంకరణతో ఉత్సవాలు ముగుస్తాయని ఈఓ వివరించారు. కార్తిక సోమవారాల్లో తెల్లవారుజామున 4 నుంచి మధ్యాహ్నం 2.30 వరకూ, తిరిగి సాయంత్రం 4 నుంచి రాత్రి 11 గంటల వరకూ స్వామివారి దర్శనాలు ఉంటాయని తెలిపారు. మిగిలిన రోజుల్లో ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ, సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకూ దర్శనాలు ఉంటాయని నీలకంఠం వివరించారు.

వాడపల్లిలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష

సాక్షి, అమలాపురం: ఆత్రేయపురం మండలంలో కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి క్షేత్రంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల పదో తేదీ నుంచి 18వ తేదీ వరకూ జరగనున్న విషయం తెలిసిందే. ఈ ఉత్సవాలను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకూ తావు లేకుండా నిర్వహించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ నెల 11, 18వ తేదీల్లో భక్తుల తాకిడి అధికంగా ఉండే అవకాశం ఉందని, పార్కింగ్, బందోబస్తు ఏర్పాట్లు, రేవుల వద్ద భద్రత చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 10న శేష వాహన సేవ, 11న హంస వాహన సేవ, 12న హనుమద్వాహన సేవ, 13న సింహ వాహన సేవ, 14న గరుడ వాహన సేవ, 15న ఉదయం సూర్యప్రభ వాహన సేవ, సాయంత్రం చంద్రప్రభ వాహన సేవ, 16న రాజాధిరాజ అలంకరణతో గజవాహన సేవ, 17న ఉదయం కల్పవృక్ష వాహన సేవ, సాయంత్రం అశ్వవాహన సేవ, 18న చివరి రోజు చక్రస్నానం కార్యక్రమాలను జరుగుతాయని వివరించారు. కళావేదిక వరకు బస్సులు నడపాలని, క్యూలు, దర్శన ఏర్పాట్లపై పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ రాహుల్ మీనా, దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఈఓ నల్లం సూర్యచక్రధరరావు, డీఎస్పీ మురళీమోహన్, ఆర్డీవో పి.శ్రీకర్, తహసీల్దార్ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించాలి



శిక్షణలో మాట్లాడుతున్న ఇషాన్ బాషా

సామర్లకోట: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గ్రామీణ నీటిపారుదల విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) చీఫ్ ఇంజినీర్ ఇషాన్ బాషా అన్నారు. జల్‌జీవన్ మిషన్‌పై 11 జిల్లాల్లోని 402 మంది ఏఈఈలు, డిప్యూటీ ఎంపీడీఓలకు సామర్లకోటలోని విస్తరణ శిక్షణ కేంద్రం(ఈటీసీ)లో మూడు రోజుల శిక్షణను సోమవారం ఆయన ప్రారంభించారు. మొదటి బ్యాచ్‌లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లోని 40 మంది ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాషా మాట్లాడుతూ, గ్రామాల్లో ప్రమాణాలు పాటించని ఆర్‌ఓ కేంద్రాల నీటి వాడకం బాగా పెరిగిపోయిందని, దీని వలన ప్రజలకు ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని చెప్పారు. జిల్లా పరిషత్ సీఈఓ లక్ష్మణరావు మాట్లాడుతూ, తరచూ తాగునీటి నాణ్యతను పరీక్షించాలని సూచించారు. ఈటీసీ ప్రిన్సిపాల్ కేఎన్‌వీ ప్రసాదరావు మాట్లాడుతూ, తాగునీటి పథకాల నిర్వాహకులు సమన్వయంతో పని చేయాలన్నారు. శిక్షణ పొందే అధికారుల కోసం ఏర్పాటు చేసిన తాగునీటి శుద్ధి యూనిట్‌ను పరిశీలించాలని సూచించారు. ప్రతి బ్యాచ్‌కు మూడు రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. కాకినాడ ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అబ్దుల్ మదీన్, విశ్రాంత ఎస్ఈ ఉమాశంకర్, పెద్దాపురం డీఈఈలు స్వామి, శ్రీరామ్, ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ జి.రమణ, చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ డి.శ్రీనివాసరావు తొలి రోజు శిక్షణ ఇచ్చారు.

రేపటి నుంచి ఆధార్ క్యాంపులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జాతీయ తపాలా వారోత్సవాల సందర్భంగా ఈ నెల 8 నుంచి ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు కాకినాడ పోస్టల్ సూపరింటెండెంట్ కె.కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8, 9 తేదీల్లో తేదిన పిఠాపురం భాష్యం హైస్కూల్, నీలపల్లి ఉన్నత పాఠశాల; 10, 11 తేదీల్లో ఏలేశ్వరం ఎంపీపీ స్కూల్, గాడిమొగ ఉన్నత పాఠశాల; 13, 14 తేదీల్లో పెద్దాపురం లూథరన్ ఉన్నత పాఠశాల, డి.పోలవరం ఉన్నత పాఠశాలల్లో ఈ శిబిరాలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఐదు నుంచి ఏడేళ్లు, 15 నుంచి 17 సంవత్సరాల మధ్య వయస్సు వారు తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు.

పత్తి పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు

విత్తనాలు, మొక్కల శాంపిల్స్ సేకరణ



పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

సాక్షి ఇంపాక్ట్

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలు తదితర గ్రామాల్లో నకిలీ పత్తి విత్తనాలతో నష్టపోయామంటూ రైతులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో అధికారులు సోమవారం పత్తి పంటను పరిశీలించారు. 'రైతుకు విపత్తి' శీర్షికన 'సాక్షి' సోమవారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. గుంటూరు లాం ఫామ్ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.రాజామణి (ప్రిన్సిపల్ సైంటిస్ట్, పత్తి), డాక్టర్ వీవీ మనోజ్ కుమార్ (ప్రిన్సిపల్ సైంటిస్ట్, తెగుళ్ల విభాగం), డాక్టర్ రాజేష్ చౌదరి (సైంటిస్ట్, కీటక శాస్త్రం), సీతారామశర్మ (పెద్దాపురం ఏరువాక కేంద్రం), జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయకుమార్, పిఠాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు పి.స్వాతి కలసి చేబ్రోలు, చెందుర్తి, తాటిపర్తి గ్రామాల్లో పర్యటించి పత్తి చేలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిజేరియం విల్ట్, ఆకుమచ్చ తెగులు, టొబాకో స్ట్రీక్ వైరస్ ఆశించడం వలన పత్తి మొక్కలు చనిపోతాయని చెప్పారు. జరిగిన నష్టంపై కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని, మొక్కల శాంపిల్స్‌ను పరీక్షించేందుకు తీసుకు వెళ్తున్నామని తెలిపారు. రైతుల నుంచి విత్తనాలు సేకరించి, వాటిని కూడా పరీక్షకు తీసుకు వెళ్తామని, రెండు రోజుల్లో నివేదిక పంపిస్తామని చెప్పారు. శాస్త్రవేత్తల వెంట అధిక సంఖ్యలో రైతులు, మండల వ్యవసాయ అధికారి కేవీ సత్యనారాయణ, గ్రామ వ్యవసాయ సహాయకులు రాజా, ఉదయ్, రెడ్డి తదితరులున్నారు. అధికారులు శాస్త్రీయంగా నిర్ధారించకుండా కేవలం తెగుళ్ల వంక చూపించి, విత్తన కంపెనీలకు కొమ్ము కాస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఈ సందర్భంగా రైతులు హెచ్చరించారు. అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. కేవలం విత్తనాల్లో నాణ్యత లేనందువల్లనే ఇంత నష్టం జరిగిందని, పూర్తి స్థాయిలో విత్తనాలను పరిశీలించి, అసలు నిజాన్ని బయటపెట్టి, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పత్తి రైతులను ఆదుకోవాలి

- తక్షణం నష్టం అంచనా వేయాలి
- నష్టపరిహారం ఇవ్వాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా



సాక్షి ప్రతినిధి, కాకినాడ: నిన్న మొన్నటి వరకూ యూరియా కొరత సృష్టించి రైతులతో ఆటలాడుకున్న కూటమి సర్కారు.. ఇప్పుడు పత్తి రైతులను కష్టాల్లోకి నెట్టేసిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. జిల్లాలోని మెట్ట ప్రాంత మండలాల్లో రైతులు గంపెడాశలతో పత్తి సాగు చేశారన్నారు. పంట చేతికొచ్చే సమయంలో అకస్మాత్తుగా మొక్కలు చనిపోతున్నా రైతుల గోడు సర్కారు చెవికెక్కడం లేదన్నారు. నకిలీ పత్తి విత్తనాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్లాటినం రకం విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతూ తీవ్రంగా మోసపోయి గగ్గోలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని కోటనందూరు, తుని, తొండంగి, గోకవరం, కిర్లంపూడి, గొల్లప్రోలు, పిఠాపురం, పెద్దాపురం తదితర మెట్ట ప్రాంత మండలాల్లో సుమారు 35 వేల హెక్టార్లలో రైతులు పత్తి సాగు చేశారన్నారు. గతంలో మూడు విడతలుగా దిగుబడి తీసేవారన్నారు. అటువంటిది రానురానూ రెండు విడతలకే పరిమితమైందన్నారు. నాలుగైదు నెలలుగా కంటికి రెప్పలా చూసుకుంటూ వస్తున్న పత్తి పంట చేతికొచ్చే సమయానికి ఇంత దారుణంగా దెబ్బతిని నష్టపోతామనుకోలేదంటూ రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి, ఎకరాకు రూ.40 వేల ఆదాయం వస్తుందనే అంచనాతో ఉన్న రైతులకు ఈ పరిణామం అశనిపాతమేనని అన్నారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా మొదట వ్యవసాయ రంగమే నష్టపోతుందని చెప్పారు. ఎప్పుడూ ఎరువులు దండిగా లభించేవని, చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత యూరియా కోసం రైతులు నానా పాట్లూ పడ్డారని గుర్తు చేశారు. ఇప్పుడు పిఠాపురం తదితర నియోజకవర్గాల్లో నకిలీ పత్తి విత్తనాల సరఫరా సర్కారుకు రివాజుగా వస్తోందని ఆరోపించారు. ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమేనని, సరైన విజిలెన్స్ లేకపోవడమే దీనికి కారణమని అన్నారు. జిల్లాలో రైతులు ఎక్కడెక్కడ పత్తి సాగు చేశారు, ఎంత మంది రైతులు, ఎన్ని ఎకరాల్లో నష్టపోయారో అధికారులు లెక్కలు రూపొందించాలని రాజా డిమాండ్ చేశారు.

స్వచ్ఛాంధ్ర ఉద్యమం నిరంతరం కొనసాగించాలి



అవార్డులు అందిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర ఉద్యమాన్ని నిరంతరం కొనసాగించాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లా స్థాయి స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవం స్థానిక గోదావరి కళాక్షేత్రం ఆడిటోరియంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ఏడాది రాష్ట్ర స్థాయిలో 2, జిల్లా స్థాయిలో 15 కేటగిరీల్లో మన జిల్లా 50 అవార్డులు అందుకుందంటూ హర్షం వ్యక్తం చేశారు. అవార్డులు సాధించిన వివిధ సంస్థల ప్రతినిధులను, అధికారులను అభినందించి, అవార్డులు అందించారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ భావన, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల్లో అదే అసంతృప్తి



అన్నవరం దేవస్థానం

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో వివిధ సేవలపై దాదాపు 30 శాతం మంది భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ఆగస్టు 26 నుంచి సెప్టెంబర్ 25వ తేదీ వరకూ రాష్ట్రంలోని సింహాచలం, అన్నవరం, ద్వారకా తిరుమల, విజయవాడ, శ్రీకాళహస్తి, శ్రీశైలం, కాణిపాకం దేవస్థానాల్లో అందిస్తున్న సేవలపై ప్రభుత్వం వాట్సాప్, ఐవీఆర్ఎస్ ద్వారా సర్వే నిర్వహించింది. ఇందులో భాగంగా అన్నవరం దేవస్థానంలో లభిస్తున్న సేవలపై గత ఆగస్టు మాదిరిగానే ఈసారి కూడా దాదాపు 30 శాతం మంది భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

- సత్యదేవుని దర్శనంపై జూన్‌లో 73, జూలైలో 74, ఆగస్టులో 75.8 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. తాజా సర్వేలో అది 74.1 శాతంగా నమోదైంది.
- మౌలిక వసతుల కల్పనలో జూన్ 66, జూలైలో 65, ఆగస్టులో 64.9 శాతం మంది సంతృప్తి చెందగా సెప్టెంబర్‌లో అది 66 శాతంగా ఉంది.
- స్వామివారి గోధుమ నూక ప్రసాదం నాణ్యతపై జూన్‌లో 77, జూలైలో 78, ఆగస్టులో 76.9 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేయగా.. ఈసారి అది 79.2 శాతానికి పెరిగింది.
- పారిశుధ్యంపై జూన్‌లో 70, జూలైలో 68, ఆగస్టులో 66.5 మంది మాత్రమే సంతృప్తి చెందగా, సెప్టెంబర్‌లో అది 64.5 శాతానికే పరిమితమైంది.

కార్తికం నాటికి చక్కదిద్దాలి

ఈ నెల 22 నుంచి కార్తిక మాసం ప్రారంభమవుతోంది. ఆ నెలంతా రత్నగిరికి భక్తుల తాకిడి ఉంటుంది. పర్వదినాల్లో లక్ష మందికి పైగా వస్తారు. ఆ సమయంలో భక్తులకు సరైన ఏర్పాట్లు చేయకపోతే ప్రభుత్వ సర్వేల్లో దేవస్థానం పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉంటుంది. కేవలం ఈఓ మీదనే బాధ్యత వదిలేయకుండా దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయం కూడా సరైన మార్గదర్శకాలు ఇవ్వడంతో పాటు అవసరమైతే ప్రత్యేకాధికారిని నియమించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నిరుద్యోగ సమస్య పరిష్కరించాలి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) నాయకులు జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వై.బాబీ మాట్లాడుతూ, నామమాత్రంగా మెగా డీఎస్సీ పోస్టులు భర్తీ చేశారని, వివిధ ప్రభుత్వ శాఖల్లో రెండు లక్షలకు పైగా ఖాళీగా ఉన్న పోస్టులను పక్కన పెట్టారని విమర్శించారు. ఎన్నికల ముందు ప్రతి నిరుద్యోగికి ఉద్యోగం లేదా రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తానంటూ కూటమి నేతలు హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పూర్తయినా ఆ ఊసే లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని బాబీ డిమాండ్ చేశారు.



జేసీకి వినతిపత్రం అందిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

సత్యదేవునికి రూ.1.49 కోట్ల హుండీ ఆదాయం



సత్యదేవుని హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది



హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్

అన్నవరం: సత్యదేవునికి హుండీల ద్వారా దండిగా ఆదాయం సమకూరింది. గడచిన 35 రోజులకు హుండీల ద్వారా రూ.1,48,77,755 రాబడి వచ్చింది. దేవస్థానంలోని హుండీలను సోమవారం తెరచి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. ఈ సందర్భంగా నగదు రూ.1,39,47,961, చిల్లర నాణేలు రూ.9,29,794 వచ్చాయని దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు తెలిపారు. హుండీల ద్వారా 62 గ్రాముల బంగారం, 345 గ్రాముల వెండి కూడా లభించాయి. అలాగే, అమెరికన్ డాలర్లు 76, ఇంగ్లండ్ పౌండ్లు 15, సింగపూర్ డాలర్లు 4, సౌదీ రియల్స్ 6, యుఏఈ దీరామ్స్ 20, ఖతార్ రియల్స్ 1, మలేషియా రింగిట్స్ 1 చొప్పున భక్తులు హుండీల్లో వేశారు. గత 35 రోజులకు సరాసరి హుండీ ఆదాయం రూ.4.25 లక్షలుగా నమోదైంది. ఈ 35 రోజుల్లో 23 రోజులు భాద్రపదం కాగా, 12 రోజులు మాత్రమే ఆశ్వయుజ మాసం. దసరా సెలవుల్లో భక్తులు రత్నగిరికి పోటెత్తడం, వివాహాది శుభకార్యాలు గణనీయంగా జరగడం కూడా హుండీ ఆదాయం పెరుగుదలకు కారణమని అధికారులు తెలిపారు.

హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్, ఈఓలతో పాటు సిబ్బంది, పలు స్వచ్ఛంద సేవా సంస్థల కార్యకర్తలు పాల్గొన్నారు. హుండీల్లో వచ్చిన నగదును స్థానిక యూనియన్ బ్యాంకుకు తరలించారు.

క్లుప్తంగా

అనారోగ్యంతో ఎంపీడీఓ కృష్ణగోపాల్ మృతి



కరప: కాకినాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కరప ఎంపీడీఓ బి.కృష్ణ గోపాల్(61) సోమవారం మృతి చెందారు. కాకినాడలోని జెడ్పీ కార్యాలయంలో ప్లానింగ్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఆయనకు పదోన్నతి లభించడంతో గత నెల 19న ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు. తర్వాత అనారోగ్య కారణాలతో సెలవు పెట్టారు. ఆయనకు భార్య, వివాహమైన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతికి పలువురు నాయకులు, అధికారులు సంతాపం తెలిపారు.

బైక్ చోరీ కేసులో ఇద్దరికి జైలు

గోపాలపురం: మోటార్ బైక్ చోరీ కేసులో ఇద్దరికి కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించినట్టు ఎస్సై పి.మనోహర్ సోమవారం విలేకరులకు తెలిపారు. గతేడాది అప్పటి ఎస్సై కర్రి సతీష్‌కుమార్ బైక్ చోరీ కేసు నమోదు చేశారు. ఈ కేసులో పూలపల్లి శివసుబ్రహ్మణ్యం, మరపట్ల రాజ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. నిందితులపై నేరం రుజువు కావడంతో, కొవ్వూరు సెకండ్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కె.నాగలక్ష్మి వారికి జైలు శిక్ష విధించారు.

తైక్వాండో పోటీలకు ఇద్దరి ఎంపిక



ఎంపికైన వారిని అభినందిస్తున్న ప్రముఖులు

రాజోలు: రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు రాజోలుకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికైనట్టు కోచ్ మణికుమార్ సోమవారం తెలిపారు. ఇటీవల కాకినాడలో జరిగిన అండర్–17 జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో వై.గంగాభవాని, హేమ సత్యశ్రీ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. స్థానిక ఎల్‌బీ నగర్‌లో జరిగిన కార్యక్రమంలో వీరిని మాజీ ఎమ్మెల్యే వేమా, జిల్లా ఒలింపిక్ సంఘ ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ గోపాలకృష్ణ తదితరులు అభినందించారు.

తరుముకొచ్చి.. కబళించిన మృత్యువు

- బైక్‌ను కారు ఢీకొని దంపతుల దుర్మరణం
- మృతులది సీతాఫలదొడ్డి ప్రాంతం
- ప్రమాదానికి కారణమైన కారును వదిలి డ్రైవర్ పరార్
- పెద్దాపురం ప్రభుత్వాస్పత్రికి మృతదేహాల తరలింపు



సంఘటన స్థలంలో పడి ఉన్న మృతదేహం, మోటార్ బైక్



గణేష్, వీరలక్ష్మి మృతదేహాలు



ఇద్దరు కుమార్తెలతో గణేష్, వీరలక్ష్మి (ఫైల్)

తమ రెక్కల కష్టంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు ఆ భార్యాభర్తలు. ఎప్పటిలాగే కూలీ పనులకు వెళ్లేందుకు కలిసి మోటార్ బైక్‌పై దంపతులు పయనమయ్యారు. కుటుంబంలో కష్టసుఖాలు చెప్పుకొంటూ.. పండగ విశేషాలను ముచ్చటించుకుంటూ.. ముందుకు సాగిపోతున్న ఆ ఇద్దరి వెనుకనే కారు రూపంలో మృత్యువు తరుముకొచ్చింది. క్షణ కాలంలో ఇద్దరినీ బలిగొన్న ఆ కారు.. కుటుంబ బాంధవ్యాల నుంచి ఆ దంపతులను శాశ్వతంగా విడదీసింది.

రంగంపేట: తూర్పు గోదావరి జిల్లా రంగంపేట మండలం కోటపాడు వద్ద ఏడీబీ రోడ్డుపై సోమవారం ఉదయం జరిగిన ప్రమాదంలో భార్యాభర్తలు మృతి చెందారు. రంగంపేట ఎస్సై ఎస్.శివప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సామర్లకోటకు చెందిన కర్రి గణేష్(45) వాలుతిమ్మాపురం వద్ద రైస్ మిల్లులో గోనె సంచులు కుడుతూ జీవనం సాగిస్తున్నారు. అతని భార్య కర్రి వీరలక్ష్మి(40) కోటపాడు వద్ద బీరు ఫ్యాక్టరీలో పనిచేస్తుంది. ఎప్పటిలాగే సోమవారం ఉదయం గణేష్ తన భార్య వీరలక్ష్మిని మోటార్ బైక్‌పై ఎక్కించుకుని బీరు ఫ్యాక్టరీ వద్ద దించడానికి బయలుదేరారు. కోటపాడు సమీపంలోని శ్రీరాం ఫామ్స్ వద్దకు చేరుకునేసరికి, కాకినాడ నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి మోటార్ బైక్‌ను వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో భార్యభర్తలు రోడ్డుపై ఎగిరి పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108 వాహనంలో వారిని పెద్దాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే వారు చనిపోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. కాగా ప్రమాదం జరిగిన వెంటనే కారును అక్కడే విడిచిపెట్టి, డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. ప్రమాదానికి కారణమైన కారును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

సీతాఫలదొడ్డిలో విషాద ఛాయలు

సామర్లకోట: రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి చెందడంతో స్థానిక సీతాఫలదొడ్డి ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. స్థానికులతో పాటు, వార్డు కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహాలను పెద్దాపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకురావడంతో మృతుల బంధువులు, కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకున్నారు. ఆస్పత్రి వద్ద బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతులకు ఇద్దరు కుమార్తెలు ఉండగా, ఓ కుమార్తెకు వివాహం చేశారు. మరో కుమార్తెకు వివాహం కావాల్సి ఉంది. వృద్ధురాలైన గణేష్ తల్లి నాగరత్నంతో పాటు, కుటుంబాన్ని భార్యాభర్తలు కష్టపడి పని చేస్తూ పోషిస్తున్నారు. దంపతులు మృతి చెందడంతో ఆ కుటుంబానికి పెద్ద దిక్కు లేకుండాపోయిందని స్థానికులు విచారం వ్యక్తం చేశారు.

రూ.లక్ష విలువైన ప్లాస్టిక్ కవర్ల పట్టివేత



స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ కవర్లు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలో సోమవారం మున్సిపల్ అధికారులు రూ.లక్ష విలువైన ప్లాస్టిక్ కవర్లను పట్టుకున్నారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని నిషేధించిన నేపథ్యంలో మున్సిపల్ అధికారులు పట్టణంలోని దుకాణాలకు వినియోగదారుల్లా వెళ్లి కవర్లు అడిగి తీసుకున్నారు. అనంతరం నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. వాణిమహల్ రోడ్ పాత విక్టరీ బజార్ ఎదురుగా ఉన్న హోల్‌సేల్ ప్లాస్టిక్ కవర్ల దుకాణంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు ఆధ్వర్యంలోని సిబ్బంది దాడి చేశారు. స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ కవర్లను మున్సిపల్ కార్యాలయానికి తరలించారు. కమిషనర్ టీవీ రంగారావు మాట్లాడుతూ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు అమ్మినా, కొనుగోలు చేసినా, వినియోగించినా జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

ఆటోను అటకాయించి దాడి

డ్రైవర్, ప్రయాణికులపై దురుసు ప్రవర్తన



రాయవరం పోలీస్ స్టేషన్ వద్ద దాడి వివరాలను చెబుతున్న బాధితులు

రాయవరం: వేకువజామున ప్రయాణికులతో వెళుతున్న ఆటోను కొందరు వ్యక్తులు అటకాయించి, దాడి చేసినట్టు కేసు నమోదు చేశామని మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు తెలిపారు. ఆయన వివరాల మేరకు, మండలంలోని వి.సావరం గ్రామానికి చెందిన వాసంశెట్టి రామకృష్ణారావు ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. సోమవారం వేకువజామున 3.30 సమయంలో హైదరాబాద్ నుంచి వస్తున్న వారిని ఆటో ఎక్కించుకునేందుకు మాచవరం వంతెన వద్దకు వచ్చాడు. ప్రయాణికులను ఎక్కించుకుని వి.సావరం వెళ్తున్న సమయంలో సోమేశ్వరం గ్రామం వద్ద అదే గ్రామానికి చెందిన శాకా వినయ్‌వంశీ ఆటోను అడ్డగించాడు. డ్రైవర్ రామకృష్ణపై దాడి చేశాడు. దాడిని అడ్డుకున్న ప్రయాణికురాలు అన్నపూర్ణపై కూడా దాడికి పాల్పడ్డాడు. వంశీతో పాటు, మరో ముగ్గురు కలిసి డ్రైవర్ రామకృష్ణ, అన్నపూర్ణతో దురుసుగా ప్రవర్తించారు. దాడికి గురైన రామకృష్ణ అనపర్తి ఆస్పత్రిలో చేరగా, ఆటోలో ప్రయాణిస్తున్న వారు మరో వాహనంలో ఇంటికి చేరుకున్నారు. ఈ ఘటనపై హెచ్‌సీ వీర్రాజు కేసు నమోదు చేయగా, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ దొరరాజు తెలిపారు.

భయంతో వణికిపోయాం

రాయవరం పోలీస్‌స్టేషన్ వద్ద బాధితులు చింతపల్లి సత్యసాయి ప్రసన్న, అనుసూరి కీర్తన, అనుసూరి అన్నపూర్ణ, అనుసూరి శ్రీను తమ గోడును వెళ్లబోసుకున్నారు. శ్రీను, అన్నపూర్ణ, వారి కుమార్తెలు సత్యసాయిప్రసన్న, కీర్తనతో కలిసి హైదరాబాద్ నుంచి బస్సు దిగి మాచవరం వంతెన వద్ద ఆటో కోసం వేచిచూస్తున్న సమయంలో వినయ్‌వంశీ, మరో ముగ్గురు తమ వాహనంలోకి రావాలని అసభ్యంగా ప్రవర్తించారని చెప్పారు. ఈలోగా ఆటో రావడంతో, అందులో ఎక్కి వెళుతుండగా ఆ నలుగురూ వెంబడించి, ఆటోను అడ్డగించి భయభ్రాంతులకు గురి చేశారన్నారు. అంతేకాకుండా అన్నపూర్ణపై వంశీ దాడి చేసి కొట్టాడన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

దొంగ హల్‌చల్

పట్టుకుని పోలీసులకు అప్పగించిన స్థానికులు



యువకులు పట్టుకున్న వ్యక్తి

నిడదవోలు: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం రాత్రి ఓ దొంగ హల్‌చల్ చేశాడు. అసోం ప్రాంతానికి చెందిన యువకుడు రాత్రి 12 గంటల సమయంలో గోడ దూకి రెండంతస్తుల భవనంలోకి ప్రవేశించాడు. భవనంలో ఇద్దరు వృద్ధ దంపతులు నివసిస్తున్నారు. వారు నిద్రిస్తున్న సమయంలో కర్ర తీసుకొచ్చిన యువకుడు తలుపులు, కిటికీలు కొడుతూ, హిందీలో తలుపు తీయాలని బిగ్గరగా కేకలు వేశాడు. ఆ దంపతులు భయపడి పైన అద్దెకుంటున్న వారికి సమాచారమిచ్చారు. వారు కిందకొచ్చి పలువురు స్థానిక యువకుల సాయంతో దొంగను పట్టుకున్నారు. కర్రతో అతడు హల్‌చల్ చేయడంతో యువకులు అతడిని నిర్బంధించారు. కాళ్లుచేతులు కట్టి పోలీసులకు సమాచారమిచ్చారు. నైట్‌బీట్‌లో ఒకే కానిస్టేబుల్ ఉండటంతో దొంగను తీసుకెళ్లడానికి తీవ్ర జాప్యం జరిగింది. స్థానికులు నిద్రపోకుండా దొంగకు కాపలాగా ఉన్నారు. సమాచారం తెలుసుకున్న టూటౌన్ ఎస్సై సీహెచ్ పరమహంస అక్కడకు చేరుకుని విచారణ చేపట్టారు. దొంగపై దాడి చేసిన యువకులపై ఎస్సై మండిపడ్డారు. ఈ క్రమంలో పలువురు మహిళలు ఎస్సైతో వాగ్వాదానికి దిగారు. చివరకు వేకువజామున మూడు గంటల సమయంలో యువకులు దొంగను పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. పట్టణ ఎస్సై జగన్‌మోహన్‌రావు ఆ దొంగ మానసిన పరిస్థితిపై ఆరా తీశారు. అతడి మానసిక స్థితి బాగోలేకనే ఇలా చేశాడని, అసోంలో ఉన్న అతడి బంధువులకు సమాచారం అందించామని చెప్పారు. దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై జగన్‌మోహన్‌రావు తెలిపారు.

వ్యాపారి హత్య!



బొదిరెడ్డి వెంకటేశ్వర్లు (ఫైల్)

ఏలేశ్వరం: నాలుగు రోజుల క్రితం అదృశ్యమైన వ్యక్తి శవమై కనిపించడంతో పోలీసులు హత్యగా అనుమానిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు, అడ్డతీగల మండలం డి.కొత్తూరుకు చెందిన బొదిరెడ్డి వెంకటేశ్వర్లు సీజనల్ వ్యాపారం చేస్తుంటాడు. ఈ నెల రెండో తేదీన దసరా కావడంతో ఏలేశ్వరంలో నివసిస్తున్న కుమారుడు ఆంజనేయులు ఇంటికి వచ్చాడు. దసరా రోజు కావడంతో బంగారు ఆభరణాలు ధరించి, కొంత నగదు తీసుకుని వేరే వ్యక్తితో కలిసి ఏజెన్సీకి వెళ్లాడు. మధ్యాహ్నం భోజన సమయం దాటాక ఎంతకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఈ మేరకు కుమారుడు ఆంజనేయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు సమీపంలోని బొంతువలస ప్రాంతం వద్ద వెంకటేశ్వర్లు మృతదేహాన్ని గుర్తించారు. మృతుడితో వెళ్లిన వ్యక్తిని పోలీసులు ఆరా తీయగా, విషయం బయటపడింది. మృతుడికి భార్య సత్యవతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఏలేశ్వరం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్ఎంసీ వెబ్‌సైట్‌లో అభ్యర్థుల జాబితా

కాకినాడ క్రైం: కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో పారా మెడికల్ కోర్సుల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రొవిజినల్ జాబితాను http://rmckakinada.com వెబ్‌సైట్‌లో వారి పరిశీలనార్థం విడుదల చేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాలో అభ్యంతరాలున్న వారితో పాటు, గతంలో సంబంధిత ధ్రువపత్రాలు సమర్పించని వారు ఈ నెల 8వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా ఆర్ఎంసీ కార్యాలయంలో అందించాలని సూచించారు. వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు.

కాకినాడ జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా సత్యనారాయణ



కాకినాడ లీగల్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కాకినాడ జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా రాజమహేంద్రవరం జిల్లా రిజిస్ట్రార్ రెడ్డి సత్యనారాయణను నియమిస్తూ రాష్ట్ర స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ ఏడాది మార్చి 28న కాకినాడ జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న కె.ఆనందరావును అవినీతి కేసులో అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు పట్టుకున్నారు. అనంతరం ఆనందరావు స్థానంలో ఉమ్మడి జిల్లా మార్కెట్ అండ్ ఆడిట్ జిల్లా రిజిస్ట్రార్ జేఎస్‌యూ జయలక్ష్మిని కాకినాడ జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా నియమించారు. ఆమె వ్యక్తిగత కారణాలతో సోమవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు సెలవు పెట్టారు. ఆమె స్థానంలో రాజమహేంద్రవరం జిల్లా రిజిస్ట్రార్ రెడ్డి సత్యనారాయణను నియమిస్తూ ఐజీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

14 నుంచి 'నన్నయ'లో ఫుడ్ ఫెస్టివల్



అధ్యాపకులతో సమావేశమైన వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలో మూడు రోజుల పాటు జరిగే మెగా ఫుడ్ ఫెస్టివల్ ఈ నెల 14 నుంచి ప్రారంభమవుతుందని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలోని ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగానికి చెందిన అధ్యాపకులతో సోమవారం ఈ అంశంపై చర్చించారు. ఈ నెల 16న ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకుని, గోదావరి రుచులను, అభిరుచులను తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఆహార పదార్థాల తయారీలో చేయితిరిగిన ఔత్సాహికులు ఈ కార్యక్రమంలో పాల్గొని, తమ ప్రతిభను చాటాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.విజయనిర్మల, హెచ్‌ఓడీ ఆచార్య డి.కల్యాణి, అధ్యాపకులు ఎంఎం కృష్ణవేణి, కె.సింధూజ పాల్గొన్నారు.

రెండు షాపుల్లో చోరీలు



ఎలక్ట్రికల్ షాపులో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

అమలాపురం టౌన్: పట్టణంలోని ఎర్ర వంతెన వద్ద, బైపాస్ రోడ్డులో ఆదివారం అర్ధరాత్రి దాటాక జరిగిన రెండు చోరీ ఘటనలతో వ్యాపారులు ఆందోళనకు గురయ్యారు. స్థానిక ఈదరపల్లి బైపాస్ రోడ్డులోని పవన్ మారుతీ కేర్ షాపు, స్థానిక ఎర్ర వంతెన సమీపంలోని కొల్లూరి బిల్డింగ్ మార్ట్‌లో ఉన్న ఎలక్ట్రికల్ షాపులో ఈ చోరీలు జరిగాయి. బైపాస్ రోడ్డులో కారులో వచ్చిన దొంగ.. షాపు షట్టర్లు పగులగొట్టి దోచుకున్నాడు. ఎర్ర వంతెన సమీపంలోని షాపు పైకప్పు పగులగొట్టి, లోనికి చొరబడి చోరీకి పాల్పడ్డారు. మరికొంత మంది దొంగలు ఇదే షాపు షట్టర్లు పగులగొట్టి మరీ షాపులోకి ప్రవేశించారు. ఈ షాపులో రూ.వేలల్లో నగదు, పది వైరు కట్టలు, ఇతర మెటీరియల్‌ను దోచుకున్నారు. బైపాస్ రోడ్డులోని పవన్ మారుతీ కేర్‌లో కొంత నగదును దొంగ తస్కరించాడు. సంఘటన స్థలాల్లో క్లూస్ టీమ్ ఆధారాలను సేకరించింది. షాపు యాజమాని జయిన గణేష్, ఎర్ర వంతెన సమీపంలోని షాపు యాజమాని కొల్లూరి గుప్తా ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసినట్టు సీఐ పి.వీరబాబు తెలిపారు. ఆయా షాపుల్లో చెరో రూ.25 వేల సొత్తు దొంగిలించినట్టు చెప్పారు. ఒకే రాత్రి రెండు షాపుల్లో దొంగలు చొరబడ్డారంటే పట్టణంలోకి వేరే ప్రాంతానికి చెందిన దొంగల ముఠా వచ్చిందని వ్యాపారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

అంతర్జాతీయ వేదికపై ప్రదర్శన గర్వకారణం



కజికిస్తాన్‌లో విద్యార్థులు ప్రదర్శించిన నాటికలో ఓ సన్నివేశం

బాలాజీచెరువు (కాకినాడ): అంతర్జాతీయ వేదికపై శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్ విద్యార్థులు ప్రదర్శనలిచ్చి ప్రతిభ చూపడం గర్వకారణమని శ్రీప్రకాష్ స్కూల్ డైరెక్టర్ సీహెచ్ విజయప్రకాష్ అన్నారు. కజికిస్తాన్, ఉజ్బెకిస్తాన్(తాష్కెంట్)లో సాంస్కృతిక పర్యటన విజయవంతంగా పూర్తి చేసి, స్వదేశానికి వచ్చిన విద్యార్థుల బృందాన్ని సోమవారం అభినందించారు. కింగ్ లియర్, జూలియస్ సీజర్ వంటి క్లాసిక్ నాటకాలను అత్యున్నత స్థాయిలో ప్రదర్శించి ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశారన్నారు. భారతీయ సాంస్కృతిక సంబంధ పరిషత్, స్వామి వివేకానంద సాంస్కృతిక కేంద్రం సహకారంతో భారత రాయబార కార్యాలయం (అస్తానా, కజికిస్తాన్) సమన్వయంతో విజయవంతంగా ప్రదర్శనలు ఇచ్చారన్నారు. విద్యార్థుల జీవితాల్లో ఇది స్ఫూర్తిదాయక మైలురాయి అవుతుందని విజయ్ ప్రకాష్ తెలిపారు.

అపశ్రుతులు అందుకేనా..?

- రత్నగిరిపై వరుస దుస్సంఘటనలపై అనుమానాలు
- ఎనిమిది నెలలుగా దేవస్థానంలో పలు వివాదాలు
- మూడు నెలలుగా ప్రమాద ఘటనలు
- గతంలో రెండేళ్లకోసారి నారాయణ యాగం, కోటి తులసి పూజలు
- భక్తుడు మరణిస్తే సంప్రోక్షణ
- ఇప్పుడు అవి లేకనే దుష్ప్రభావాలంటూ అభిప్రాయాలు



ఆగస్టు ఎనిమిదో తేదీన ప్రకాష్ సదన్ వద్ద దగ్ధమవుతున్న సీఎన్‌జీ కారు



గత నెల 27న రత్నగిరిపై పశ్చిమ రాజగోపురం వద్ద మంటల్లో ఫ్యాన్సీ షాపు గోడౌన్



రత్నగిరిపై కోటి తులసి పూజ నిర్వహిస్తున్న పండితులు (ఫైల్)

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఎనిమిది నెలలుగా వివాదాల నడుమ వార్తల్లో నిలుస్తోంది. మూడు నెలలుగా పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మూడేళ్లుగా ఎటువంటి యాగాలు, కోటి తులసి పూజలు జరగకపోవడం, భక్తుని మృతి తర్వాత కూడా సంప్రోక్షణ పూజలు నిర్వహించకపోవడమే ఇందుకు కారణమనే అభిప్రాయం పండిత వర్గాల్లో వ్యక్తమవుతోంది.

వైష్ణవాలయాల్లో పవిత్రోత్సవాల పేరిట..

సత్యదేవుని సన్నిధికి నిత్యం వేలాది మంది భక్తులు విచ్చేస్తున్నారు. వీరిలో కొందరు భక్తులు తెలిసో తెలియకో అశౌచం, ఇతర రాకూడని పరిస్థితుల్లో స్వామివారి సన్నిధికి వస్తుంటారు. ఇది అన్ని దేవస్థానాల్లో జరిగేదే. వైష్ణవాలయాల్లో పవిత్రోత్సవాల పేరుతో ఏడాదికి ఒకటి లేదా రెండు సార్లు ప్రత్యేక పూజలు చేసి, ఆలయాన్ని శుద్ధి చేస్తుంటారు. తిరుమల తిరుపతి దేవస్థానం, సింహాచలం, ద్వారకా తిరుమల దేవస్థానాల్లో బ్రహ్మోత్సవాలకు ముందు ఇటువంటి పూజలు చేస్తుంటారు. దీంతో ఆయా దేవస్థానాల్లో దుస్సంఘటల వల్ల ఏర్పడిన ప్రభావం పోయి మరలా పవిత్రత చేకూరుతుందనే నమ్మకం ఉంది.

గతంలో యాగాలు, సంప్రోక్షణలు

అన్నవరం దేవస్థానంలో కూడా గతంలో రెండేళ్లకోసారి మహానారాయణ యాగం, కోటి తులసి పూజలు నిర్వహించేవారు. చివరగా 2022 ఫిబ్రవరిలో సత్యదేవుని సన్నిధిన పది రోజులు కోటి తులసి పూజ నిర్వహించారు. దేవస్థానంలో భక్తుడు మరణిస్తే వెంటనే సంప్రోక్షణ పూజలు చేసేవారు. మృతదేహాన్ని తరలించిన మార్గంలో కొండ దిగువ వరకూ సంప్రోక్షణ చేసేవారు. దీంతో తిరిగి పవిత్రత నెలకొంటుందనే భావన ఉండేది. కొన్నాళ్లుగా దేవస్థానంలో ఇటువంటి యాగాలు, సంప్రోక్షణ పూజలు జరగలేదు.

రెండు నెలల్లో దుస్సంఘటనలు

- రెండు నెలల క్రితం దేవస్థానంలోని సిక్స్ వీఐపీ సత్రంలో బస చేసిన భక్తుడు అపస్మారక స్థితిలో ఉండగా, కొండ దిగువన దేవస్థానం ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. కొండపైనే అతడు మృతి చెందాడని, ఉద్దేశపూర్వకంగా కొండదిగువన చనిపోయినట్టు ప్రకటించారని తర్వాత వెల్లడైంది.
- ఆగస్టు ఒకటో తేదీన దేవస్థానంలోని స్మార్త ఆగమ పాఠశాల విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురికాగా, హుటాహుటిన తుని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ అన్నవరం వచ్చి పరిస్థితిని సమీక్షించాల్సి వచ్చింది.
- ఆగస్టు ఆరో తేదీన ప్రకాష్ సదన్ సత్రం వద్ద పార్కింగ్‌లో ఉంచిన సీఎన్‌జీ కారు దగ్ధమైంది. ఆ కారుతో పాటు పక్కనున్న మరో రెండు కార్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి.
- గత నెల 27వ తేదీన పశ్చిమ రాజగోపురం వద్ద ఫాన్సీ షాపు గోడౌన్‌లో అగ్నిప్రమాదం జరిగి రూ.పది లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. దేవస్థానం సెక్యూరిటీ అధికారులు సకాలంలో స్పందించి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో పెను ప్రమాదం తప్పింది. లేకపోతే మరిన్ని దుకాణాలకు మంటలు వ్యాపించి, ఆస్తి నష్టం రూ.కోట్లలో ఉండేది.
- ఈ నెల మూడో తేదీ రాత్రి విష్ణుసదన్ సత్రంలో మూడో అంతస్తు నుంచి తల్లీకుమారుడు కింద పడ్డారు. తల్లికి రెండు కాళ్లు విరగగా, కాకినాడ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె పరిస్థితి విషమంగానే ఉంది. కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి.
- ఇవే కాకుండా కొద్ది నెలలుగా అధికారుల వ్యవహార శైలి కారణంగా దేవస్థానం తరచూ వార్తల్లో ఉంటున్న విషయం తెలిసిందే.

ఈ నెల 22 నుంచి కార్తిక మాసం ప్రారంభమవుతుండగా, నిత్యం వేలాది మంది భక్తులు స్వామివారి సన్నిధికి విచ్చేస్తుంటారు. తెల్లవారుజామున రెండు నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ఆలయం తెరిచే ఉంటుంది. కార్తిక పౌర్ణమి నాడు జరిగే గిరి ప్రదక్షిణలో మూడు లక్షలు మంది భక్తులు పాల్గొంటారు. అదే రోజు స్వామివారి ఆలయానికి లక్ష మంది వరకు విచ్చేస్తారు. ఈ నేపథ్యంలో కార్తిక మాసానికి ముందే దేవస్థానంలో సంప్రోక్షణ పూజలు చేయిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పండితులతో చర్చిస్తాం

దేవస్థానంలో సంప్రోక్షణ పూజలు జరిపించే విషయమై దేవస్థానం పండితులతో చర్చిస్తాం. అవసరమనుకుంటే కార్తిక మాసం కన్నా ముందుగానే చేయిస్తాం.

– ఐవీ రోహిత్, చైర్మన్, అన్నవరం దేవస్థానం